
# భాగ్యనగరంలో 'బాస్మతి' దందా!

**-రంజాన్ నేపథ్యంలో బాస్మతి బియ్యానికి డిమాండ్**
**-బ్రాండ్‌నేమ్ లేకుండానే జోరుగా విక్రయాలు**
**-అడ్డగోలు ధరలతో దోపిడీ చేస్తున్న వ్యాపారులు**



**హైదరాబాద్, మార్చి 26,ప్రభాతవార్త:** బిర్యానీకి,హైదరాబాద్‌కు విడదీయలేని అనుబంధం ఉంది..దీంతోపాటు బిర్యానీ తయారీకి ఉపయోగించే బాస్మతి బియ్యం అంటే కూడా హైదరాబాద్‌నే ప్రత్యేకంగా చెప్పుకోవాలి.ముఖ్యంగా రంజాన్ సమయంలో ఈబియ్యానికి ఎక్కువ గిరాఖీ ఉంటుంది. దీంతో వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులుఅందినకాడికి దోచుకుంటున్నారు. ఎలాంటి బ్రాండ్‌నేమ్ లేకుండానే దిగుమతి చేసుకుని వాటిని ప్యాకింగ్ చేసి వారికి ఇష్టమొచ్చిన రేటు వేసి అమ్మకాలు కొనసాగిస్తున్నారు.దీంతో తాము కొనుగోలు చేసే బియ్యం బ్రాండెడ్‌ఏనా అన్న అనుమానం వినియోగదారుల్లో వ్యక్తమౌతుంది.ఈ బాస్మతి బియ్యం తెలంగాణలో ఉత్పత్తి లేకపోయినా దేశంలోని వివిధ ప్రధాన నగరాలకు ఇక్కడి నుండే ఎగుమతులు జోరుగా సాగుతున్నాయి. బాస్మతి బియ్యాన్ని పంజాబ్,హర్యానా,డిల్లీ వంటి రాష్ట్రా నుండి హైదరాబాద్‌కు ఇక్కడి నుండి మళ్లీ ఇతర ప్రాంతాలకు భారీ ఎత్తున రవాణా అవుతోంది. హైదరాబాద్‌లోని ప్రధాన మార్కెట్లయిన బేగంబజార్,కిషన్ గంజ్,ఉస్మాన్ గంజ్,టోకుమార్కెట్లు బాస్మతి బియ్యం అమ్మకాలకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. ఈమార్కెట్‌లకు ప్రతి రోజూ టన్నుల కొద్దీ బాస్మతి బియ్యం ఆయా రాష్ట్రాల నుండి రైల్వే వ్యాగన్లు,లారీల్లో తరలివస్తుంటాయి.తిరిగి ఇక్కడి నుండి రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రకు సైతం రవాణా అవుతున్నాయి. ఇక నగరంలోని స్టార్‌హోటళ్లు,ఇతర బిర్యానీ హోటళ్లన్నీ కూడా బాస్మతిని ఈమార్కెట్‌ల నుండే కొనుగోలు చేస్తుంటాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు 30వేలక్వింటాళ్లకు పైగా బియ్యం వినియోగం అవుతుండగా అందులో బాస్మతి బియ్యం దాదాపుగా 6వేల క్వింటాళ్ల వరకూ ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. అయితే రంజాన్ సమయంలో బాస్మతి వినియోగం ఎక్కువగానే ఉంటుందని తెలుపుతున్నారు. సాధారణ బియ్యం క్వింటాల్‌కు రూ.6వేల నుండి 8వేల వరకు పలుకుతుండగా..ఖరీదైనా బాస్మతి బియ్యం 15వేల నుండి 20వేల వరకూ పలుకుతుంది. ఇతర రాష్ట్రాల నుండి రోజుకు టన్నుల కొద్దీ బియ్యం నగరానికి వస్తున్నా..ఎంత వ్యాపారం జరుగుతుందన్నదానిపై లెక్కలు మాత్రం కనిపించవు. గతంలో వ్యాట్‌నుండి తప్పించుకునేందుకు వ్యాపారులు జీరోదందాపైనే దృష్టిపెట్టేవారు. జీఎస్టీ అమలులోకి వచ్చేనాటికి బాస్మతి బియ్యం వ్యాపారుల నుండి వాణిజ్యపన్నుల శాఖకు దాదాపు 350కోట్లు మేరకు పన్నులు రావాల్సి ఉండగా జీఎస్టీలో వ్యవసాయ ఉత్పత్తులపై పన్ను తొలగింపుతో వ్యాపారులంతా ఊపిరిపీల్చుకున్నారు. బ్రాండెడ్ రైస్‌పై జీఎస్టీ 5శాతం చెల్లించాల్సి ఉంటుంది. కానీ నగరం నుండి బయటకు వెళ్లే బాస్మతి బియ్యానికి ఏవిధమైన బ్రాండ్‌నేమ్ లేకుండా సాధారణ బియ్యం లాగానే ఎగుమతి చేస్తున్నారు. తిరిగి ఆయా నగరాల్లో కొన్ని రకాల బ్రాండ్‌ల పేరుతో విక్రయిస్తున్నారు.ఇలా వ్యాపారులు సిండికేట్‌గా మారి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పోతోంది. అసలు మార్కెట్ కమిటీ జాబితాల్లో చాలా మంది వ్యాపారులు లేరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారులు వ్యాపారుల నుండి పెద్దమొత్తంలో లంచాలు దండుకుంటుండటం వల్లనే ఈపరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తుంది. మరికొన్ని ప్రాంతాల్లో ఎలాంటి రిజిస్టేషన్‌లు లేకుండానే బాస్మతి అమ్మకాలు కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి పడుతుంది.




# హైదరాబాద్ వార్త

## జిహెచ్ఎంసి మేయర్‌ను కలిసిన ఇండియానా పోలో బృందం

**హైదరాబాద్, మార్చి 26,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి తో అమెరికా దేశానికి చెందిన ఇండియానాలో పోలో బృందం బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో భేటీ అయ్యింది. 2010 లో ఇండియనా స్టేట్‌తో పలు అంశాలపై సిస్టర్‌సిటీ ఒప్పందం చేసుకుంది. ఈ నేపథ్యంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆబృందాన్ని సాదరంగా ఆహ్వానించి ధన్యవాదాలు తెలిపారు. సిస్టర్ సిటీ ఒప్పందంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇండియనా ప్రతినిధులు మేయర్‌కు వివరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ గతంలో కంటే చాలా అభివృద్ధి చెందినట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ పరిధిని పెంచి గ్లోబల్ సిటీ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అంతే కాకుండా హైదరాబాద్ చుట్టూ మరొక త్రిబుల్ ఆర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఉత్తరం వైపు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు.



ఇండియానా పోలో ప్రతినిధులను సన్మానిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసిలో సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణకు రూ. 7032 కోట్లతో రోడ్డు వెడల్పు, ఫ్లై ఓవర్ల నిర్మాణాలు చేపట్టి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు ఇట్టి పనులు పూర్తయితే గ్లోబల్ సిటీ గా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నగరంలో పాఠశాల విద్యా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ప్రతినిధులను మేయర్ కోరగా సానుకూలంగా స్పందించి అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తామని వారు మేయర్ కు వివరించారు.


ఉప్పల్‌లో ఎల్ఎస్‌జితో మ్యాచ్ సందర్భంగా ప్రాక్టీస్ చేస్తున్న ఎస్ఆర్‌హెచ్ టీమ్

## భాగ్యలక్ష్మి మందిరంలో వైభవంగా ఉగాది,నవరాత్రి మహోత్సవాలు

**చార్మినార్,మార్చి 26 ప్రభాతవార్త :** చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో ఉగాది,నవరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని మందిరం ట్రస్టీ శశికళ వెల్లడించారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో నవరాత్రి ఉత్సవాలు మార్చి నెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ నెల 6వ తేదీ వరకు జరగనున్నాయని ఆమె తెలిపారు.30వ తేదీ ఆదివారం ఉదయం ఘటస్థాపన, ఏప్రిల్ నెల 5వ తేదీన శనివారం అష్టమి హవన్ కార్యక్రమం, శ్రీ భాగ్యలక్ష్మి అమ్మ వారు మోహినీ రూపంలో దర్శనం,ఛప్పన్ భోగ్ దర్శనం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఆమె తెలియజేశారు.ఏప్రిల్ 6వ తేదీన నవమి సందర్భంగా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు శ్రీ భాగ్యలక్ష్మి అమ్మ వారి పల్లకి శోభాయాత్ర అత్యంత వైభవంగా మందిరం నుంచి ప్రారంభవం అవుతుందని, పాతనగరంలోని పలు ప్రాంతాలలో కొనసాగిన అనంతరం తిరిగి మందిరానికి శోభాయాత్ర చేరుకుంటుందని శశికళ వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.


చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మ వారి చిత్రం

## వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డులకు రూ.26వేల వేతనం నిర్ణయించాలి

**-మినిమమ్ టైం స్కేల్ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ వేతనం 19వేలు చెల్లించాలి**
**-తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సిఐటియూ) నాయకులు డిమాండ్**



ధర్నాలో నినాదాలు చేస్తున్న సిఐటియూ నేతలు

**ధర్నాచౌక్, మార్చి 26, ప్రభాతవార్త:** పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం 26 వేల రూపాయలుగా నిర్ణయించాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు పోలీస్‌ల పర్మిషన్ ఇచ్చినప్పటికీ ఖమ్మం, కరీంనగర్, పెద్దపల్లి తదితర జిల్లాల్లో నాయకులను అరెస్ట్ చేయటాన్ని రాష్ట్ర కమిటీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈధర్నాకు ముఖ్య అతిధిగా సీఐటియూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జే.వెంకటేష్‌లు హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం లోకి వస్తే సెక్యూరిటీ గార్డుల బతుకులు బాగుపడతాయని అనుకుంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉన్న చందంగా ఉందని విమర్శించారు. సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రులకు, అధికారులకు అనేక దరఖాస్తులు ఇచ్చినప్పటికీ స్పందన లేదని ఆరోపించారు. జీవో నెంబర్ 814 ప్రకారం టైం స్కేల్ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ వేతనం 19 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, నేరుగా మార్కెట్ కమిటీల నుండే వేతనాలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అమలవుతున్న పథకాలు ఇక్కడ ప్రభుత్వం కూడా అమలుచేయాలని, ఉద్యోగులు చనిపోతే సాధారణ మరణానికి రెండు లక్షలు, ప్రమాద మరణానికి ఐదు లక్షల నష్టపరిహారం చెల్లించాలని, మహిళలకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవలు ఇవ్వాలని, రిటైర్ అయిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ వ్యవసాయ మార్కెట్ కమిటీలలో ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టు నుండి సూపర్‌వైజర్ పోస్టుల వరకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో సెక్యూరిటీ గార్డుల సర్వీసు, విద్యార్హతలను బట్టి రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, గ్రామపంచాయితీ యూనియన్ నాయకులు పి.సుధాకర్, రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, ఉపాధ్యక్షులు పి.వెంకన్న, కార్యదర్శులు వై.రామాంజయ్య, జి.వెంకటస్వామి, సుధారసం రమేష్, ఎం.డి.యాకుబ్‌అలీ, ఎం. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు చట్టం తీసుకురావాలి

**సైఫాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** బిసిలకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో పెంచిన 42 శాతం రిజర్వేషన్‌లు అమలు కోసం రెండు బిల్లులు పాస్ చేయడం చారిత్రాత్మకమని బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం చెప్పారు. ఈ రెండు బిల్లులను వెంటనే అమలు చేయాలని కోరారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిసి నాయకులు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, జిల్లపల్లి అంజీ, అనంతయ్యలతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి పంపి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటే సరిపోదని, బీహార్, తమిళనాడు రాష్ట్రాల ప్రభుత్వాలు గతంలో అనుసరించిన విధానాలను అవలంభించి, చట్టసభలలో బిల్లులకు రాజ్యాంగ సవరణ చేయించి, చట్టాలు తీసుకురావాలని కోరారు. అప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై వత్తిడీ తీసుకురావాలని, ఇందుకు బిసి సంఘాలు పోరాటానికి సిద్దంగా ఉన్నాయని ఆయన చెప్పారు. అలాగే సెంట్రల్ యూనివర్సిటికి చెందిన 400 ఎకరాల భూమితోపాటు ప్రభుత్వ భూములను ఎక్కడ అమ్మరాదని ఆయన డిమాండ్ చేశారు. ఆ భూముల్లో విద్యార్థులకు హాస్టల్ భవనాలు, గురుకులాల భవనాలు నిర్మించాలని కోరార.ఈ సారి ఎవరైన సుప్రీంకోర్టుకు వెళ్ళినా కేసు చెల్లుబాటు కాదన్నారు. రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించి, బిసి విద్యార్థులకు హాస్ట ల్స్, ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్స్, గురుకులాలు సాధించడం జరిగిందని ఆయన వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం. చిత్రంలో నీల వెంకటేష్, వేముల రామకృష్ణ తదితరులు

## బంజారాహిల్స్‌లో ఘనంగా ఇఫ్తార్


ఇఫ్తార్‌విందులో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మీ, కార్పొరేటర్ కవితారెడ్డి, నారాయణరెడ్డి, డా.శ్రీధర్‌పెద్దిరెడ్డి తదితరులు

**హైదరాబాద్, మార్చి 26,ప్రభాతవార్త:** రంజాన్ మాసం పర్వదినం పురస్కరించుకొని బుధవారం బంజారాహిల్స్‌లో ఇఫ్తార్‌విందు ఘనంగా నిర్వహించారు. రోడ్‌నెంబర్ 12లోని రెనోవా ఎన్ఐజిఎల్‌లో ఏర్పాటు చేసిన ఈవిందుకు మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి మేయర్, కార్పొరేటర్ మన్నె కవిత, టి. నారాయణ రెడ్డి, తదితరులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లిం సోదరులకు ఉపవాస దీక్షను విరమింపజేశారు. చైర్మన్ డాక్టర్ శ్రీధర్ పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ రంజాన్ మాసం పర్వదినం పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా అభినందనీయమని తెలిపారు. నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ముస్లింలకు ముందస్తుగా ఆమె రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ముఖ్య అతిధులను డైరెక్టర్ డా.ఆర్‌వి రాఘవేంద్ర రావు శాలువాలతో ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో రాకేష్ శర్మ,డా. రాధా కృష్ణ రావు, రవీంద్రనాథ్, జహీర్,సుబ్బా రెడ్డి పాల్గొన్నారు.

## ఐపిఎల్ మ్యాచ్‌లకు ఆర్టీసి ప్రత్యేక బస్సులు

**-వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి సర్వీసులు**
**-24డిపోల నుంచి 60 బస్సులు ఏర్పాటు**

**హైదరాబాద్, మార్చి 26,ప్రభాతవార్త:** ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్లు తిలకించే క్రికెట్ అభిమానుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి వచ్చేందుకు గ్రేటర్ పరిధిలోని 24 డిపోల నుంచి 60 ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేయనుంది. ఐపీఎల్ మ్యాచ్లు జరగనున్న తేదీల్లో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి.ఉప్పల్ స్టేడియంలో మార్చి 27, ఏప్రిల్ 6, 12, 23, మే 5, 10, 20, 21 తేదీల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రధానంగా ఘట్‌కేసర్, హయత్ నగర్, ఎన్జీవోస్ కాలనీ, ఎల్బీనగర్, కోఠి, లక్డీకాపూల్, దిల్‌షుఖ్‌నగర్, మేడ్చల్, కేపీహెచ్‌బి, మియాపూర్, జేబీఎస్, ఈసీఐఎల్, బోయిన్‌పల్లి, చార్మినార్, చాంద్రాయణగుట్ట, మెహదీపట్నం, బీహెచ్ఎల్ వంటి వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియం వరకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపనుంది.

## కారు,బైకు ఢీ..ఇద్దరి మృతి

**బేగంపేట మార్చి 26,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ మహంకాళీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్డీరోడ్డు మినర్వా గ్రాండ్ హోటల్ చౌరస్తాలో బుధవారం ఉదయం గం 5ల సమయంలో కారు,బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు.వీరిలో ఒకరు ప్రమాదం జరిగిన స్పాట్‌లోనే మృతి చెందగా,మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలియజేసారు.మహంకాళీ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బన్సీలాల్‌పేట సీసీనగర్‌కు చెందిన దేవీప్రణయ్(18),బిజేఆర్ నగర్‌కు చెందిన ఎర్ర హర్షిత్(21)జీహెచ్ఎంసీ వేస్ట్ కంట్రోల్‌లో పనిచేస్తున్నారు.వీరిద్దరూ నైట్ డ్యూటీ ముగించుకుని ప్యారడైజ్ వద్ద టీ తాగారు.ఇద్దరు కల్సి బుధవారం ఉదయం గం 5ల సమయంలో స్పోర్ట్స్ బైకుపై ఇంటికి బయలుదేరారు.బైకు ఎస్డీ రోడ్డులోని మినర్వా గ్రాండ్ హోటల్ చౌరస్తా వద్ద అతివేగంగా స్విఫ్ట్ డిజైర్ కారును ఢీకొంది.ఈ ప్రమాదంలో సీసీ నగర్ కు చెందిన దేవీ ప్రణయ్(18)ఘటనా స్థలంలోనే చనిపోగా,ఎర్ర హర్షిత్‌ను గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించినట్లు పోలీసులు తెలియజేసారు.ఈ ఘటనలో ప్రమాదానికి కారణమైన మహబూబ్ నగర్ కు చెందిన కారు డ్రైవర్ కుర్మయ్య (32)పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహంకాళీ ఇన్స్‌పెక్టర్ కె.పరుశురాం తెలియజేసారు.

## ఈత కోసం చెరువులో దిగి బాలుడు మృతి

**గచ్చిబౌలి, మార్చి 26 ప్రభాతవార్త** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న మిస్సింగ్ కేసు విషాదంగా ముగిసింది. మంగళవారం కనిపించకుండా పోయిన బాలుడు ఈత కోసం చెరువులోకి దిగి నీళ్లలో మునిగి మృతిచెందినట్లు గుర్తించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం కుర్లీ గ్రామానికి చెందిన బి.మల్లయ్య, బాలమణిలు బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి నానక్‌రాంగూడలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా వీరికి ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కార్తీక్(14) నానక్‌రాంగూడ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 24వ తేదీన ఉదయం మల్లయ్య, బాలమణిలు పని నిమిత్తం బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంట్లో కార్తీక్ కనిపించకపోడంతో తెలిసిన వారివద్ద, చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో మంగళవారం ఉదయం గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. కాగా బుధవారం ఉదయం ఐటి కారిడార్ పరిధిలోని విప్రో చెరువులో గుర్తు తెలియని బాలుడి మ ృతదేహాన్ని గుర్తించిన వెంకటయ్య అనే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కార్తీక్ కుటుంబ సభ్యులను రప్పించగా, మృతదేహం కార్తిక్‌దేనని గుర్తించారు. చెరువు కట్ట మీద బట్టలు ఉండడంతో ఈత కోసం చెరువులోపలికి దిగిన కార్తీక్ నీళ్లలో మునిగి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. బాలుడు ఒక్కడే చెరువు వద్దకు వచ్చాడా ఇంకా ఎవరైనా ఉన్నారా అనే విషయాలు తెలియరాలేరు. ఈమేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## మంత్రివర్గ విస్తరణలో లంబాడిలకు ప్రాతినిధ్యం కల్పించాలి

**హైదరాబాద్, మార్చి 26,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షలకు పైగా ఉన్న లంబాడి సామాజిక వర్గానికి మంత్రివర్గ విస్తరణలో కచ్చితంగా స్థానం కల్పించాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ డిమాండ్ చేశారు. ఈమరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో స్థానిక సంస్థలు ఎన్నికలు ఉన్నందున 3 వేలకు పైగా గిరిజన గ్రామపంచాయతీ తెలంగాణలో ఉన్నాయని లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించినట్లయితే కాంగ్రెస్ పార్టీకి గిరిజన లంబాడి సమాజం అండగా ఉంటుందని లేదంటే పార్టీ నష్టపోయే అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లంబాడి సామాజిక వర్గానికి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఈవిషంపై గతంలోనే ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ,కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ , ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కలిసి వినతిపత్రం కూడా అందజేయడం జరిగిందని, గత 16 నెలలుగా వేచి చూస్తున్న తమ వర్గం పట్ల సానుకూలంగా స్పందించి త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు, ఈ కార్యక్రమంలో రామచంద్రనాయక్, సురేష్ నాయక్, హరికిషన్ నాయక్,సుబ్బు నాయక్, రమేష్ రాథోడ్, భావసింగ్, నరేందర్ పవార్, నందు నాయక్ , నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌నాయక్, రాంచంద్రనాయక్ తదితరులు

## మచ్చబొల్లారం స్మశానవాటికను సందర్శించిన హైడ్రా బృందం

**-స్మశానవాటిక ఆక్రమణలపై అసెంబ్లీలో గళమెత్తిని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**


స్మశానవాటికను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

**అల్వాల్, మార్చి 26 ప్రభాతవార్త:** మచ్చబొల్లారం స్మశాన వాటిక కబ్జాలకు గురవుతోదంటూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీలో వినిపించిన గళం ఫలితమిచ్చింది. అల్వాల్ సర్కిల్ పరిధిలోని మచ్చబొల్లారంలో దాతలు 15 ఎకరాలను హిందూ స్మశాన వాటికి కోసం ఇచ్చారు. కొంత స్థలం కర్మకాండలకు వినియోగిస్తుండగా మిగిలిన భూమిని జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్‌గా వాడుతోంది. నిత్యం పెద్ద సంఖ్యలో చెత్త వాహనాలు రావడంతో అపరిశుభ్రతకు తోడు అనారోగ్య సమస్యలు స్థానికులను వేధిస్తున్నాయి. 50 కాలనీలకు చెందిన జెఏసి డంపింగ్ యార్డ్‌ను తరలించాలని ఆందోళనకు దిగాయి. ఎమ్మెల్యే స్వయంగా చెత్తాచెదారంలో కూర్చుని తన నిరసను తెలిపారు. డంపింగ్ యార్డ్‌ను అనధికారికంగా రాంకీ నిర్వహిస్తోంది. ట్రాన్స్‌సిస్ట్ పాయింట్ కాస్త యార్డ్‌గా మారి పోవడం స్థానికులను ఆగ్రహానికి గురి చేసింది. అసెంబ్లీలో హిందూ స్మశాన వాటిక కబ్జాకు సంబంధించి ఎమ్మెల్యే మర్రి ప్రస్తావించడంతో హైడ్రా రంగంలోకి దిగింది. సర్కిల్ డిసి శ్రీనివాస్ రెడ్డి, హైడ్రా తహసీల్దార్ హేమమాలిని, ఇన్‌స్పెక్టర్ ఆదిత్యగౌడ్, అల్వాల్ డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు బుధవారం యార్డ్‌ను సందర్శించిన వారిలో ఉన్నారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి స్థానిక పరిస్థితిని అధికారులకు వివరించారు. అక్రమంగా వెలిసిన దుకాణాలకు సంబంధించి ఆరా తీసిన అధికారులు తక్షణం వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్మశానవాటికకు సంబంధించి సర్వే రిపోర్టు ను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అనుమతులు లేకుండా రాంకీ యార్డ్‌ను వాడుకుంటుండడంపై కూడా విస్మయాన్ని వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ కారణంగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక ప్రజలు వివరించారు. ఈ కార్యక్రమంలో జెఏసికి చెందిన ప్రతినిధులుతో పాటుగా బిఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
**- ఎంజిఐటి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి**



ఎంజిఐటి కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి.

**నార్సింగి, మార్చి 26 ప్రభాతవార్త :** ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంజిఐటి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గండిపేటలోని ఎంజిఐటి కళాశాలలో ఆలివ్ ఆసుపత్రి వైద్య బృందం ఉచిత గుండె వ్యాధి పరీక్షలను నిర్వహించారు. 150.మంది కళాశాల సిబ్బంది ఈ వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఒత్తిడి కారణంగా అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఒత్తిడిని జయించి ప్రశాంతతను పొందాలంటే ప్రతీ రోజు ఓ గంట సమయం పాటు నడక, సూర్య నమస్కారాలు, ఆసనాలు, యోగ, ప్రాణాయామం, ధ్యానం వంటివి చేయాలన్నారు. బయటి ఆహారాన్ని పూర్తిగా మానేసి, ఇంట్లో తయారు చేసిన తాజా ఆహార పదార్థాలను తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వలన 90.శాతం రోగాలకు దూరం అవుతామన్నారు. సీజనల్ పళ్లు తినడం వలన అంటు వ్యాధులన్నింటికి దూరం అవుతామన్నారు. ఏడాదికి ఒకమారు మొత్తం బాడీ చెకప్ చేయించుకొని, వైద్యుల సలహాల మేరకు అవసరమైన మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలివ్ ఆసుపత్రి టుడిఇకో డాక్టర్ స్వప్న, డాక్టర్ శివ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక చట్టం ద్వారానే న్యాయవాదులకు రక్షణ
**-బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్టు అధ్యక్షుడు రఘురామ్‌రెడ్డి**

**చిక్కడపల్లి, మార్చి 26 ప్రభాతవార్త:** న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, హత్యలకు అరకట్టాలంటే న్యాయవాదుల కోసం ప్రత్యేక రక్షణ చట్టం రావాల్సిన అవసరం ఉందని, ఆ చట్టం ద్వారానే న్యాయవాదులకు రక్షణ ఉంటుందని బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్టు అధ్యక్షుడు కె.రఘురామ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ ఆధ్వర్యంలో దారుణ హత్యకు గురైన న్యాయవాది ఇజ్రా యిల్ హత్యను నిరసిస్తూ కోర్టు విధులను బహిష్కరించారు. రంగారెడ్డి బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా కోర్టు జీవితకాల సభ్యుడు అయిన ఇజ్రాయిల్ హత్యను ఖండించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.రఘురామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.మధుసూదన్ మాట్లాడుతూ పట్టపగలు ఒక న్యాయ వారిని రోడ్డుపై హత్య చేయటం అత్యంత హేయమైన చర్య అన్నారు. హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగ తక్షణమే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాత్రను తీసుకు రావాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.తిరుపతిరెడ్డి, వై.రంజిత్‌రెడ్డి, ఎం.కిరణ్‌కుమార్ యాదవ్, కార్యవర్గసభ్యుడు రమేష్,న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు


ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మార్చి 26 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం లో బుధవారం హుండీ లెక్కింపు చేశారు. ఈ సందర్భంగా దేవాలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, కార్యనిర్వాహణ అధికారి మాచర్ల దేవనాథం నిర్వహణలో జరిగిన ఈ లెక్కింపులో రూ.1,75,462 దేవాలయానికి ఆదాయం వచ్చింది. దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మురికి గణేష్ , దేవాలయాల అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి : నర్సింహ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నర్సింహ్మ

**సైఫాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న 17 వేల మంది కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఎల్ అండ్ టి కంపెని యాజమాన్యాన్ని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మ డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనం చెల్లించకపోవడం దారుణమన్నారు. బుధవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన రాష్ట్ర మిషన్ భగీరథ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ఎం.నర్సింహ్మ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాల జివోను అమలు చేయకుండా యాజమాన్యం వారి శ్రమశక్తిని దోపిడీ చేయడం దారుణమన్నారు. జివో నెంబరు 60 ప్రకారం కార్మికులకు కనీసవేతనాలు చెల్లించాలని, అలాగే పండగలకు సెలవులు, వారంతపు సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, గ్రాడ్యుటీ వంటి చట్టాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఎం.రఘు, సి.శేఖర్, టి.సత్యనారాయణ, పి.శ్రీనివాస్, ఎం.ప్రభాకర్‌రెడ్డి, ఎం.డి.జానీ, ఎస్.రాంప్రసాద్, పాషా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన వారిని పరామర్శించిన కార్పొరేటర్



**యూసుఫ్‌గూడ, మార్చి 26, ప్రభాతవార్త :** ఇటీవల అల్లాపూర్ డివిజన్ రామారావునగర్ నుంచి కాశీకివెళి తిరిగి వస్తుండగా బస్సు బోల్తాపడి 11మందికి గాయాలయ్యాయి. దీనితో వారు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి రాగా వారిని బుధవారం డివిజన్ కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్ పరామర్శించారు. వారికి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకు న్నారు. ఈకార్యక్రమంలో నియోజక వర్గం బీసిసెల్ అధ్యక్షులు నాగుల సత్యం, మాజీ కౌన్సలర్ సిహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై సిబిఐచే విచారణ జరిపించాలి

**సైఫాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** పాస్టర్, ఒక టివి ఛానల్ యాంకర్ పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై తెలుగు రాష్ట్రాలలోని క్రైస్తవులకు పలు అనుమానాలు ఉన్నందున రెండు ప్రభుత్వాలు వెంటనే సిబిఐ, హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని పలు క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి. త్వరలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్ర హోం శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని సంఘాలు తెలిపాయి. బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు, బిషప్‌లు ముల్కల భాస్కర్, డిన్నీ, సింగం, శ్రీకాంత్‌క్రిస్, సుధీర్‌కుమార్, కెనడి, అశోక్, రవీందర్, విలియం తదితరులు మాట్లాడుతూ పగడాల ప్రవీణ్‌కుమార్ క్రైస్తవులకు అత్యంత ఆప్తుడని, ఆయన మృతిని క్రైస్తవులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, ముఖ్యంగా హిందూ మతోన్మాదుల నుంచి చంపుతామని బెదిరింపులు కూడా వచ్చాయని, ఈ విషయాన్ని ఆరు నెలల క్రితమే ఆయన ఎపిలో ఫిర్యాదు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ప్రవీణ్‌కుమార్ పోస్టుమార్టం రిపోర్టును న్యాయబద్ధంగా చేయాలని, రిపోర్టును జాప్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలన్నారు. ఆయన మరణం కక్షపూరితంగా జరిగిందేనని తమకు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. సోషల్ మీడియాలో మతాలపై డిబెట్లు పెట్టి కించపరచడం నేడు మామూలైపోయిందని వారు విమర్శించారు. ఇలాంటి దుశ్చర్యలను సోషల్ మీడియా చానల్స్ మానుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్ భాస్కర్. చిత్రంలో డినీ్న, సింగం, కెనడి తదితరులు

## ఇఫ్తార్ విందులో మాజీ మంత్రులు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రులు పద్మారావుగౌడ్, మహమూద్ అలీ,తలసాని.

**బేగంపేట మార్చి 26,ప్రభాతవార్త**

సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్టలో బుధవారం సాయంత్రం రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. పద్మారావుగౌడ్, మహమూద్ అలీ,మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణ్‌గౌడ్,అత్తెల్లి మల్లిఖార్జున్‌గౌడ్,అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్,నాయకులు మహేష్‌యాదవ్,అరుణ్‌భట్,కిరణ్‌గౌడ్,గణేష్,రహమాన్,అబ్దుల్లా,సోహెల్,అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## బాబుల్‌రెడ్డినగర్‌లో పర్యటించిన కార్పొరేటర్


బాబుల్‌రెడ్డి నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి


**మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 26 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి.వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు.బాబుల్‌రెడ్డి నగర్‌లో అసంపూర్ణ పనులు వల్ల డ్రైనేజీ నిండి పోయి పొంగి పొర్లు తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చే యాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఈ సందర్భంగా వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏఈ నరసింహామూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ హరీష్,లోక్‌నాథ్,రమేష్‌రెడ్డి,సెంట్రింగ్ శంకర్ మధుసూధన్,రావుల భాస్కర్,ఎన్ని శంకర్‌రెడ్డి,తలారి చిన్న,రెడ్డి రమణ గుప్తా,అనిల్ రెడ్డి,కురుమూర్తి మురళీ,గోపాల్ నాయక్,చెన్నమ్మ,మల్లేష్,లింగం బస్తీ వాసులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్‌విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయి


అల్లాపూర్‌లో జరిగిన ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.

**యూసుఫ్‌గూడ, మార్చి 26, ప్రభాతవార్త :** ఇఫ్తార్ విందులు మత సామరస్యంతో పాటు సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. బుధవారం అల్లాపూర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్‌డి రహీమ్, ఎమ్ఐఎమ్ సీనియర్ నాయకులు ఎమ్‌డి మహ్మద్, సయ్యద్ జుబేర్, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కృష్ణారావు, నియోజక వర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు వారిని శాలువలతో సన్మానించారు. రంజాన్ మాసంలో కఠోర దీక్షలతో ఉపవాసం ఉంటూ భక్తిని పెంపొందిస్తారని అన్నారు. రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.ఈ ప్రాంతంలో కులమతాలకు అతీతంగా హిందు ముస్లింలు సోదరభావంతో ఇఫ్తార్ విందులో పాల్గొనడం అభినందనీయమని అన్నారు.కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిల య్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, మాదవ చారి,చోటా షరీఫ్, జ్ఞానేశ్వర్, సయ్యద్ రియాజ్, కృష్ణారా వు, లక్ష్మణ్, కాశీనాథ చారి, జితేందర్, నర్సింహ, హైమ ద్, పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రజల గోస పట్టించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** అమలుకాని హామీలతో, అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల గోస పట్టించుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా హితవు పలికారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తారీఖు జీతాలు అందించలేక, అప్పుల కోసం వెంపర్లాడుతున్న ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని ప్రారంభించి, యువతను ఆదుకుంటామని చెప్పటం రాజకీయ బూటకమని విమర్శించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఫ్రీబస్సు అని బస్సుల సంఖ్య తగ్గించారు, కళ్యాణమస్తు పథకం ద్వారా ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని, మోసంచేశారని, రెండు లక్షల రైతు ఋణమాఫీ అడ్డగోలు వ్యవహారంగా మారిందని, ఇప్పటి వరకు ఏ పథకం కూడా మాకు చేరలేదంటూ ప్రజలు గొగ్గోలు పెడుతూ ఉంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల గోడు పట్టించుకుని చిత్తశుద్ధితో పరిపాలన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్‌కుమార్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

## క్రీడల ప్రాముఖ్యతను పెంచేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తా : పొన్న కృష్ణ


మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా నియామక పత్రంను అందుకుంటున్న పొన్నకృష్ణ దృశ్యం

**నార్సింగి, మార్చి 26 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో క్రీడల ప్రాముఖ్యతను పెంచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు పొన్న కృష్ణ పేర్కొన్నారు. బుధవారం పొన్న కృష్ణకు ఉపాధ్యక్షుడిగా నియమించిన పత్రంను మాస్టర్ గేమ్స్ ఫెడ్రేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ కె.రామరెడ్డి, అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రామారావ్‌లు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా పొన్న లక్ష్మణ్ మాట్లాడుతూ గత 30.ఏళ్లుగా క్రీడలపై మంచి పట్టు, అనుభవం ఉండడం వలన తనకు ఈ బాధ్యతను అప్పగించారని వివరించారు. నాపై ఉంచిన నమ్మకంను మరింత పెంచుకునేందుకు గ్రామాలలో క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువతను ఎంపిక చేసుకొని నిష్ణాతులతో శిక్షణ ఇప్పించి ఉత్తమ ప్రతిభను కనబర్చే క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ పదవి నా బాధ్యతను మరింత పెంచిందని, ఇష్టమైన రంగంలో పని చేసే అవకాశం లభిస్తే అనంతమైన ఆనందం ఉంటుందన్నారు. నన్ను ఏకగ్రీవంగా ఎంపిక చేసిన ప్రతినిధుల బృందంకు ప్రత్యేక ధన్యావాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న గండిపేట మండలంలోని పలువురు రాజకీయ నాయకులు పొన్న కృష్ణకు అభినందనలు తెలిపారు.

## మహా నగర సంకీర్తన


అన్నమయ్య ఆరాధన సందర్భంగా మహా నగర సంకీర్తనలో పాల్గొన్న డాక్టర్ శోభారాజు తదితరులు

**చిక్కడపల్లి, మార్చి 26 ప్రభాతవార్త:** భక్తి సంగీతం ద్వారా భావ కాలుష్య నివారణ అనే దృక్పథంతో పద్మశ్రీ డా. శోభారాజు "అన్నమాచార్య భావనా వాహిని" ఆధ్వర్యంలో 522వ అన్నమాచార్య ఆరాధన సందర్భంగా పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, శిష్య బృందం బుధవారం మహానగర సంకీర్తన గాన కార్యక్రమం జరిగింది. చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం నుండి ట్యాంక్ బండ్ వద్ద నున్న అన్నమాచార్య విగ్రహం వరకు సాగిన ఈ నగర సంకీర్తన సందర్భంగా శ్రీవేంకటేశ్వర స్వామి వేషధారణతో సాందీప్, అన్నమయ్య వేషధారణలో అభిరామ్, శ్రీవేంకటేశ్వర స్వామి, అన్నమయ్య చిత్రపటాలతో, నాద స్వరంతో, వేద పండితుల సహకారంతో సుమారు ఒక గంట పాటు సాగింది. ఈ కార్యక్రమంలో పండిట్ కాశీనాథ్ మిశ్రా మాట్లాడుతూ మాధవ నామమే శరణం అని అన్నారు. కల్కి అవతారం విశేషాలు తెలియజేస్తూ హరి నామము విశిష్టతను వివరించారు, రానున్న వైపరిత్యాలకు, కలి మలానికి విరుగుడు మందు కేవలం మాధవ నామమే అని తెలిపారు. రామ యోగి జీ కూడా పాల్గొని ప్రసంగించారు. చివరిగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి, అన్నమయ్యకు హారతి అందించి పసందైన అల్పాహార ప్రసాద వితరణ జరిగింది.

## పృథ్వీశ్వర్ ఆల్ రౌండర్ ప్రతిభ
**-104 రన్స్, 3వికెట్లతో సత్తా చాటిన పాంథర్స్ ఆటగాడు**


గెలుపొందిన విజేత జట్టు

**హైదరాబాద్,మార్చి 26,ప్రభాతవార్త:** తెలంగాణ డిసిక్ట్స్ క్రికెట్ అసోసియేషన్ (టీడీసీఏ) వన్డే ట్రోఫీలో పాంథర్స్ బ్యాటర్ ఆర్.పృథ్వీశ్వర్ ఆల్‌రౌండర్ ప్రదర్శనతో అదరగొట్టాడు. తొలుత బ్యాట్‌తో 76 బంతుల్లో 104 పరుగులు చేసి శతకం సాధించిన పృథ్వీ తర్వాత మూడు వికెట్లు (3/30) తీసి సత్తా చాటాడు. బుధవారం తెలంగాణ రూరల్ రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాంథర్స్ మొదటి బ్యాటింగ్ చేసింది. సెంచరీ హీరో పృథ్వీశ్వర్‌తో పాటు అభినవ్ (65), మణీశ్వర్ (58) అర్ధ శతకాలతో రాణించారు. మొత్తంగా పాంథర్స్ 45.1 ఓవర్లలో 296కు ఆలౌటైంది. ఛేదనలో రైజర్స్ జట్టు 36.5 ఓవర్లలో 172కు ఆలౌటై ఓటమి పాలైంది. పాంథర్స్ బౌలర్లలో స్టీఫెన 4, పృథ్వీ 3 వికట్లు పడగొట్టారు. మరో మ్యాచ్‌లో వారియర్స్ జట్టుపై అమెరికా టీమ్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన వారియర్స్ 36.1 ఓవర్లలో 105కు ఆలౌటైంది. అమెరికా జట్టు 16 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసి విజయం సాధించింది. టీడీసీఏ వ్యవస్థాపక చైర్మన అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ఈ రెండు మ్యాచుల్లో బాగా ఆడిన క్రికెటర్లను అభినందించారు.

## ఎర్రకుంట అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల చేయూత మరువలేనిది : సురేష్‌గౌడ్

**నార్సింగి, మార్చి 26 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ 18.వ,డివిజన్ పరిధిలో ఉన్న ఎర్రకుంట అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న చేయూత మరువలేనిదని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోకరి సురేష్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం సేల్స్‌ఫోర్స్, గ్రీన్‌యాత్ర, బయోడైవర్సిటీ పార్కు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల బృందం ఎర్రకుంటలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ డిఇఇ యాదయ్య, స్థానిక నాయకుడు సురేష్‌గౌడ్‌లు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రకుంటలోకి సాఫీగా వరద నీరు వచ్చే ఏర్పాట్లు చేయడం, అహ్లాదాన్ని పంచే అందమైన మొక్కలు నాటడం వంటి పనులు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కుంట చుట్టూ ఫెన్సింగ్ వేసి కబ్జాకు అడ్డుకట్ట వేయడంతో పాటు, పాదచారులు వాకింగ్ చేసేందుకు వీలుగా వాకింగ్‌ట్రాక్‌ను, పచ్చిక బయళ్లను, రకరకాల పూల మొక్కలను పెంచుతామని ప్రకటించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాదచారులు ఈ కుంట వద్దకు వచ్చి వాకింగ్, యోగ, ఆసనాలు, ప్రాణాయామం చేసుకునేందుకు అనుకూలంగా తయారు చేయనుండడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛంద సంస్థలకు మావంతు సహకారం అందించి, ఎర్రకుంట అభివృద్ధిలో భాగస్వాములం అవుతామని సురేష్‌గౌడ్ స్పష్టం చేశారు.


బండ్లగూడ కార్పోరేషన్‌లోని 18.వ,డివిజన్‌లో ఉన్న ఎర్రకుంటలో మొక్కలు నాటుతున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, నాయకుల దృశ్యం.

## ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకునేందుకు పోలీసుల సహకారం

**గోషామహల్,మార్చి 26ప్రభాతవార్త:** ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకునేందుకుగాను పోలీసులుఎల్లప్పుడు సహకరించడం జరుగుతుందని అందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సౌత్,వెస్ట్ జోన్ డిసిపిచంద్రమోహన్ అన్నారు.ఈమేరకు బుధవారం సాయంత్రం ఆరుగంటలకు భాగ్యనగర్ శ్రీరామ ఉత్సవ సమితి ప్రతినిధులు డాక్టర్ భగవంత్ రావు,గోవింద్‌రాఠి,మెట్టువైకుంఠం,శ్రీరామ్‌వ్యాస్,బిజెపి నాయకులు కృష్ణ,గోషామహల్‌ట్రాఫిక్,లా అండ్‌అర్డర్ ఎసిపిలు ధనలక్ష్మి, వెంకట్‌రెడ్డి,సిఐ మహేష్‌లతో కలిసి సీతారాంబాగ్ ఆలయ ప్రాంతాన్నిపరిశీలించారు.ఏప్రిల్ 6వ తేదిన జరిగే శ్రీరామ శోభయాత్రకు సీతారాంబాగ్ ఆలయం ప్రాంతం నుంచి మొదలుకుని యాత్ర ముగింపు వరకు ప్రత్యేక ఏర్పాట్లు,అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. లా అండ్ అర్డర్, జలమండలి, ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బి ,అగ్నిమాపక విభాగం అధికారులతో కలిసి సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లుచేయడం జరుగుతుందన్నారు.అంతే కాకుండా ఉత్సవ సమితి ప్రతినిధులు కూడా సకాలంలో శోభయాత్రను ప్రారంభించేందుకుగాను తగిన ఏర్పాట్లు చేయాలని డిసిపి చంద్రమోహన్ సూచించారు.అందుకు ఉత్సవ సమితిప్రతినిధులు కూడా శోభయాత్రను ప్రారంభిస్తామన్నారు.సీతారాంబాగ్ ప్రాంతంలో అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు.డిసిపి చంద్రమోహన్ జోనల్ కమీషనర్‌తో చర్చించి సీతారాంబాగ్ ఆలయ పరిసర ప్రాంతంలో అభివృద్ధి పనులను చేయించడం జరుగుతుందన్నారు.ఏప్రిల్ 3వ తేదిన నగర పోలీసు కమీషనర్ సి.వి.ఆనంద్ సీతారాంబాగ్‌లో ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు.ఈకార్యక్రమంలో బిజెపి గోషామహల్ అధ్యక్షులు సోమ్‌రాజ్ సింగ్,ఎస్ఐలు బానుప్రకాష్,సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సీతారాంబాగ్ ప్రాంతాన్ని ఉత్సవ సమితి ప్రతినిధులతో పరిశీలించిన డిసిపి చంద్రమోహన్

## సర్క్యులర్‌పై గవర్నర్‌ను కలిసేందుకు యత్నించిన పలువురు అరెస్టు

**తార్నాక, మార్చి 26 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవానికి హాజరయ్యేందుకు ఓయూకు వచ్చిన గవర్నర్‌ను కలిసి వర్సిటీలోని సమస్యలపై వినతిపత్రం అందజేసేందుకు బీఆర్ఎస్ నాయకులు బుధవారం ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని లాలాగూడ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీలో ఎలాంటి ఆందోళనలు నిర్వహించకుండా అప్రజాస్వామికంగా అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల హాస్టల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, దానిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. దీనిపై అర్ధరాత్రి విద్యార్థినిలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశా రు. క్యాంపస్ లోని అన్ని హాస్టల్లో మెస్ లలో నాణ్యత లోపించిందని, నాణ్యతతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు.యూనివర్సిటీలో విద్యార్థులు ఇన్ని సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. వర్సిటీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో బీఆర్ఎస్ నేతలు డాక్టర్ సత్య, గౌతమ్ ప్రసాద్, అస్మా ఉన్నారు.


గవర్నర్‌కు వినతి పత్రం అందజేసేందుకు యత్నిస్తున్న విద్యార్థి సంఘం నేతను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## రజక ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి
**-రాష్ట్ర రజక సంఘం అధ్యక్షులు గంపల శ్రీనివాస్**



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న గంపల శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 26,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రజక కులస్థులకు రజక ఫెడరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రజక సంఘం అధ్యక్షులు గంపల శ్రీనివాస్ కోరారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులకు సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రజకులను విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక నిరంతర సేవకులు రజకులు అని, అటువంటి రజకులు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచామన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం పాటుపడుతున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా తమ కులస్తులకు మా జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో సీట్లు కేటాయించాలన్నారు.లేని పక్షంలో ఏప్రిల్ నెల చివరి వారంలో వేలాది మంది రజకులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈసమావేశంలో సంఘం నేతలు వెంకన్న, పోశం, శ్రీకాంత్, శివ, శేఖర్, సంపత్ పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణ దానంతో సమానం



**హైదరాబాద్ మార్చి26,ప్రభాతవార్త :** గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంధ్యకు రక్త అవసరం తెలియడంతో రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవి శేఖర్ రెడ్డి క్షణం ఆలస్యం చెయ్యకుండా హుటాహుటిన నిమ్స్ ఆసుపత్రికి చేరుకొని రక్తదానం చేశారు. దీనివల్ల ఆ మహిళకు ప్రాణాపాయ స్థితి తప్పింది.అత్యవసర పరిస్థితిలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్త దానం చెయ్యడం సూర్తి దాయకము నిమ్స్ డాక్టర్ రఫత్ డాక్టర్ రవి శేఖర్ రెడ్డి కి ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. డాక్టర్ రవి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ రక్త దానం ప్రాణదానం తో సమానం అని రక్తం దొరక్క చాలా మంది మరణిస్తున్నారని అత్యవసర ప్రాణాపాయ స్థితిలో వున్నప్పుడు రక్తం దానం చేస్తే ఒకరి ప్రాణాన్ని కాపాడిన వారవుతారని.. ఇది ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని అన్నారు.

## అక్రమణకు గురైన వక్ఫ్ బోర్డు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



**సైఫాబాద్, మార్చి 26 ప్రభాతవార్త:** ఒక ఎమ్మెల్సీ తండ్రి కబ్జా చేసిన భూమిని హైకోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వక్ఫ్, ఎఫ్‌టిఎల్‌కు అప్పగించాలని అబ్బాసీ లా ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం ప్రతినిధి, హైకోర్టు న్యాయవాది ఖవి అబ్బాసీ మాట్లాడుతూ 1996లో రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్ వద్ద వక్ఫ్ బోర్డుకు సంబంధించిన 3 ఎకరాల భూమిని, ఎఫ్‌టిఎల్‌కు సంబంధించిన 3 ఎకరాల పది గుంటల భూమిని ఆ ఎమ్మెల్సీ తండ్రి కబ్జా చేశారని ఆరోపించారు. ఆ భూముల కబ్జాపై 2022లో తాము హైకోర్టును ఆశ్రయించామని, దీనిపై జిహెచ్ఎంసి, రెవిన్యూ, ఇరిగేషన్, వక్ఫ్‌బోర్డు విచారణ జరిపి ఈ భూములు కబ్జాకు గురైనట్లు తెల్చాయని తెలిపారు. దీనిపై నెల 25న రాష్ట్ర హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, ప్రభుత్వం వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని పేర్కొందని ఆయన తెలిపారు. ఆ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే హైడ్రా తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాదులు రిజ్వాన్ ఆఫ్మీ, జునేద్ బాసిక్, ఇంక్విలాల్ పార్టీ నాయకుడు సమీల్లా అజాద్ పాల్గొన్నారు.

**IN THE DEBTS RECOVERY TRIBUNAL- II, TRIVENI COMPLEX ( PALACE HEIGHTS) ABIDS, HYDERABAD - 500001**

**O.A.No.629 OF 2024**

Between:
**CANARA BANK**, Pragathi Nagar, Kukatpally Br. ...APPLICANT

**AND**

**M/s. Sree Sai Aluminium and Fabrication** ...DEFENDANT

To,
**M/s. Sree Sai Aluminium and Fabrication**, Rep. by its Proprietor, Sri. D. Rambabu, S/o. Gananyya Dakka, H.No. 1-2-80/3, Miyapur X Roads, Bollaram Road, Serilingampally, Hyderabad-500049.Sankranthi Hotel Lane.

**CORRIGENDUM**

Whereas the above DRT notice published in Vaartha Telugu Daily, Hyderabad on 21.02 2025 in which recovery debt amount wrongly mentioned as Rs. 28,53,049.92/- **but the correct amount is Rs. 21, 29, 761.91 ps. The case is posted to 30.04.2025.** Hence this Corrigendum.

**M/s. SANGEETA JAISWAL,** Advocate, # 12-8-170, Mettuguda, Secunderabad.

**PUBLIC NOTICE**

Under the instructions of my client by name **Chintala Raju Yadav S/o. Late. Chintala Balaiah,** Aged about 47 years, Occ: Agriculture, R/o: H.No.1-41/2, Masid Banda, Kondapur Village, Seri Lingampally Mandal, Ranga Reddy District, I am issuing this public/caution noticeto the public that, my client Chintala Raju Yadav has filed a civil suit for partition and separate possession of land in Sy No.93 part to an extent of Ac.4.00 Gts situated at Kondapur Village, Serilingampally mandal, Ranga Reddy District vide O.S No. 76/2025 on the file of Senior Civil Judge, R.R.District at Kukatpally. wherein the Hon'ble court granted exparte ad interim injunction orders restraining the alleged plot holders from alienating or creating third party interest as well as from raising any further construction over the said property vide orders Dated 07-03-2025 in I.A No.279/2025 & 280/2025 Hence the general public hereby requested that not to purchase the said plots fallen under the above mentioned land of Sy No.93 Part to an extent of Ac.4.00 Gts situated at Kondapur Village, Serilingampally mandal, R.R.District.

**Sri K. Venugopal Reddy**
**Advocate**
O/o: 2-2-1109/BK/MIG 93, Nandanavanam, Shivam Road, Opp: Papaji Dhabha, Bagh Amberpet, Hyderabad, 500013.
**Cell No.9848177722**

**IN THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT: AT: L.B. NAGAR**
**O.S.No. 69 of 2025**

Between:
**Kolluru Srinivas & 2 others** ...Plaintiffs

AND

**1). To Who So It may Concern**
**2). The Tahsildar,** Saroornagar Mandal, R.R District ...Defendants

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my clients **(1). Kolluru Srinivas** S/o. Late. Kolluru Chandrasekhara Rao, **(2). Kolluru Murthy Narayana** S/o. Late. Kolluru Chandrasekhara Rao, and **(3). Kolluru Gopi Chand** S/o. Late. Kolluru Chandrasekhara Rao filed a suit for declaration of them as legal heirs of Late. Kolluru Chandrasekhara Rao & Late. Kolluru Sujatha Devi before the Hon'ble III Addl.Junior Civil Judge, Ranga Reddy District, at L.B. Nagar vide O.S.No. 69 of 2025 and the said case is posted on **29-04-2025.**

//By the order of the court//

**S. Someshwar Rao**
**Advocate**
H.No.9-8-214, II floor
DMRL X Roads
Near Owaisi Hospital
Santhosh Nagar,
Hyderabad.
**Cell: 9866644062**

